కథానిక:

# విభావరి

●

శ్రీ కె. వీరభద్రాచారి

హృదయాలు వికసించే పండువెన్నెలలో చల్లని పిల్లగాలులు గిలిగింతలు పెట్టుతున్నాయి. రాకాచంద్రికల్లో ద్రవించుతున్న నిద్దపు పాలరాతివిగ్రహంతో అరమోడ్పుకనులలో మౌనసంభాషణ సాగిస్తున్నాడు శిల్పి - శివశ్రీ. ప్రక్కనే అందాలు చిందే సౌదామిని ఆనందలేశమైనా లేని భావనలలో ఆలోచనలు సాగిస్తుంది. శివశ్రీ మూడుపదులు వసంతాలు నిండని యౌవనమూర్తి. ఆ విశాలనయనాంచలాల్లో అతని కళాప్రౌఢిమములోని గాంభీర్యము రేఖామాత్రముగ దర్శన మిస్తుంది. తారుణ్యం, సౌందర్యం శివశ్రీని మరింత కళామూర్తిగ చిత్రిస్తాయి. మాటలు రాని, హృదయం లేని ఆ శిలావిగ్రహమే తన జీవిత సర్వస్వముగా ఎంచుకొనే లుబ్ధత్వము గోచరిస్తుంది ఆ కళాజీవి ఏకాగ్రతలో. ఆరాధించి ఆరాధించి ఆ అద్భుతసుందరిలో ఐక్యము కావటమే అతని జీవిత పరమావధిగా ఆశిస్తున్నాడా అనిపిస్తుంది. నిండు కండ్లలో చూచి చూచి అరమోడ్పుకనులలో ఏమో ఆలోచిస్తాడు. చూడలేని అందాలను అన్వేషిస్తున్నట్లు కన్నులు మూస్తాడు. ఈ రసవాహినినుండి బయటికి రాలేడు. హృదయమిచ్చి హృదయాన్ని అభిలషించే సుందరి తన సరస నందనే జ్ఞానమైనా అతనికి లేదేమో? మూసిన ఆ కళ్లతో తాను దర్శించేది ఆ శిల్పకన్య అతిలోకసౌందర్యశోభలనేనా?

అపుడపుడే యౌవనప్రాంగణంలో అడుగు పెట్టుతున్న సౌదామినిలో తీయని కలలు తేలిపోయినాయి. ఏ శివశ్రీకి-అతని శిల్పానికి-కళామయజీవితానికి తాను ముగ్ధురాలైనదో - ఆ శివశ్రీకే- తన తల్లిదండ్రులు తన్ను వివాహం చేయబోతున్నారంటే తన అదృష్టమనుకొంది. అంతులేని ఆనందంతో జీవితమే ఓ మధుర వసంత మనుకొంది. హృదయాంకితమైన శివశ్రీకి తన సర్వస్వము సమర్పణ చేసికొంది. ఆరాధించింది. "మన మిద్దరం జీవికాజీవులం" అనే శివశ్రీమాటలు విన్నప్పుడు, తిరిగి స్మరించుకొన్నప్పుడు తన సౌభాగ్యానికి ఎంతో గర్వపడింది. కాని శిల్పిజీవితగతి ఆమెకు ఎన్నాళ్లో అర్థంకాలేదు. శిలాఖండాలకు కళాసుందరి రూపాలను నేర్పుతో ఇచ్చే అతనికి ధన్యవాదాలర్పించుకొంది. కాని ఆ శిలలలో, ఉలిచెక్కుళ్లలో ఆ సేవలో-తన్ను తన ఉనికినే విస్మరించాడు. ఎన్నాళ్ళని సహిస్తుంది? ఎన్ని తీయని రేలు, మరెన్ని జ్యోత్స్నావికాసాలు, ఎన్నెన్ని ఉషశ్రీలు, వృథాగా, లోని మధురవాంఛలు లోనే మణగిపోతూ, తరలిపోయినాయి. "ఈ విగ్రహాల సౌందర్యమంతా నీ అందాలో ఎన్నోవంతు? అయినా నీ మూర్తేగా ఈ సృష్టికి మాతృక!" అనే, తన శివశ్రీ, తన్నెందు కిలా ఉపేక్షించాడు? "సృష్టికర్తకే రూపముంటే తాను చేసిన యీ విశ్వంలో సౌందర్యాన్నంతా గాలించి నిన్ను చూచి నీ అపూర్వసౌందర్యానికి గర్వంతో తన కళాకౌశలానికి తానే మురిసిపోతూఉండేవాడు" అనే తన శివశ్రీకి, తన అందాల్లో విశ్వాసం పోయిందా? లేక అతను అన్నట్లే తన సృష్టికి తానే మురిసిపోతున్నాడా! సౌదామిని సుఖజీవితానికి ఈ బండరాళ్లు ప్రతిబంధకాలయాయి. ఏమి టీ విచిత్రసాపత్న్యము?

వెన్నెలలకు, పిల్లగాలులకు రేగే మధురవాంఛలు సౌదామిని లేతహృదయాన్ని ఉక్కిరి బిక్కిరి చేసినాయి. పైగా తన మాటలకు పలుకని, తనవైపైనా చూడని, శివశ్రీ నిర్లక్ష్యము, ఉపేక్ష, మనస్సును కలచి

వేస్తున్నాని. శివశ్రీ తన మధురస్వాప్నికలోకపు అవధులు దాటలేదు. తన కళాజగత్తు వీడి ఈ వాస్తవ ప్రపంచంలో అడుగు పెట్టలేదు. తన సౌదామిని-తన మెరుపుతీగ-తన కళామూర్తుల మాతృక-పిలుపు, విసుపు కూడ అతనికి వినపడలేదు. మరి సహించలేకపోయింది సౌదామిని. ఎన్నాళ్ళని? ఎన్నేళ్ళని? తన జీవితాన్నిట్లా అర్థంలేని త్యాగం చేసుకోవటమెందుకు? ఎందుకీ కల? ఎందుకో ఈ శిల్పం? హృదయం ప్రణయం లేని రాళ్లలో, యితని హృదయం, ప్రణయం, కూడ మాయమైనాయి. తానిక ఇక్కడ ఉండలేదు. ఈ రాళ్లలో ఈ ఔదాసీన్యంలో-ఈ నిర్జీవవాతావరణంలో ఉండలేదు. ఈ చైతన్యము లేని ప్రాంగణంలో-ఈ మృతశీతల హృదయం గల వ్యక్తితో సౌదామినివంటి నవోఢయువతి ఎట్లా ఉండగలుగుతుంది? తనలోని-సౌందర్యాన్ని, కవోష్ణమధువాంఛలను ఆస్వాదించి, అనుభవించి ప్రత్యనుభవాల నిచ్చే వ్యక్తి ఈ కళాశిలి కాడు.

పాపం! సమాధిలో శివశ్రీ ఒక నీడ లేచి తన పైనుండే పాకిపోవటంకూడ గుర్తించలే. తన అర్ధాంగి తన్ను విడిచిపోవటం ఎలా ఊహించగలుగుతాడు?

* * *

చిక్కని పాలలా వెన్నెల కురుస్తోంది. మంచు సూదుల్లా పొడుస్తోంది. చలిగాలి బాధ కలిగిస్తోంది. ఇంచుమించు అరణ్యంలోలా ఆ తోటల్లో నడుస్తున్న సౌదామినికి తన స్నిగ్ధహృదయంలో వెచ్చదనము, మధురవాంఛలలోని తీక్ష్ణత్వము, నవయౌవనంలోని సౌందర్యశ్రీలు 'అడవికాసిన వెన్నెల'ను జ్ఞాపకం చేశాయి. కళ్లు చెమరించాయి. ఏదో అనిర్వాచ్యమైన వేదన-ఏదో ఉద్వేగంతో ఆమెపాదాలు త్వరత్వరగా కదులుతున్నాయి. అర్థం లేని, గమ్య మెరుగని ఆ ప్రయాణం అంత వేగంగా సాగటం సమన్వయించుకోలేని విషయం. కాని సత్యం. అందుకనే ఎదుర వచ్చే వ్యక్తికి ఆమెపాదవిన్యాసాల్లో ఓ విచిత్రలాస్యంగోచరించింది. సన్నని దారి విడచి ప్రక్కగా పొదల్లో ముళ్లలో నడుస్తున్న ఆ సుందరిస్థితి అర్థం చేసుకోలేకపోయినాడు. చేసుకోకుండా ఉండలేదు. అతడే సామ్రాజ్యచక్రంలో నాటి 'నాట్యరత్న'. తన అఖండనాట్యకళాప్రౌఢిమ చేత దేశాన్ని సమ్మోహనను ముగ్ధులను చేసి ఆనందాన్నిచ్చి 'రత్న' పదవి స్వీకరించాడు. ఆకర్ణాంతమైన అతని లేఎఱ్ఱని కండ్లలో ఓ ప్రత్యేక ఆకర్షణ, నిరంతర సౌందర్యదిదృక్షు సూచితమౌతాయి. ఎదుటి మెరుపుతీగకు కనులు చెదరి, కనపడనట్టుగా ఎదరకే వెళ్లాడు. ఆమెకు ఇహలోకజ్ఞానము, ఇంద్రియచైతన్యం మృగ్యమైనట్టు, చాచిన సుధాకర్ చేతుల మధ్యకు చేరుకొంది. సుధాకర్ తిరిగి ప్రయాణం సాగించాడు, ఆ అందాలను మూటకట్టుకొని తన సౌధానికి.

* * *

'నాట్యరత్న'కూ సౌదామినికీ హృదయాలు కలిశాయో లేదో చెప్పలేము కాని చేతులూ, చూపులూ కలిశాయి. నేటినుండి సౌదామిని సుధాకర్ అర్ధాంగి. కాని సుధాకర్ కో చేరరాని, తెలియరాని, తెలుసుకోనేందుకు అధికారం లేని, ఓ విషయ ముంది. అతడడుగరాదనే వాగ్దానముతోనే ఈ పాణిగ్రహణం జరిగింది. అది ఆమె పూర్వజీవితం. ఆ జీవితగ్రంథంలో ఇంతవరకు గతించిన పుటలను తిరిగి రేగనీయకూడదు. శివశ్రీతో తన జీవితం జ్ఞాపకానికి వస్తే సౌదామిని తన ప్రస్తుతజీవితంలో ఇకేమి సౌఖ్యాన్ని అనుభవించగలుగుతుంది? ఆ అనుభవాల ఛాయలనైనా స్మృతిపథాన పడనీయకూడదు. అట్లా అయితే తాను గృహాన్ని విడిచి వచ్చిన ఆశయం కొంతైనా నెరవేరుతుందేమో? సుధాకరు డనుకొంటాడు: 'గతించిన ఆశ్వాసాలలో వర్ణితమైన ఏ విషాదకావ్యమో పునఃస్మరణలో దుర్భర దుఃఖాన్ని కల్గిస్తుంది కాబోలు' అని తాను ప్రశ్నించకూడ దనుకొంటాడు. ఆమె నిషేధించిన రహస్యస్థలాల ప్రవేశించకూడ దనుకొంటాడు. ఏ పొరపాటుననో ప్రవేశిస్తాడు. ఆమె తెల్లబోతుంది. ముఖం విషాదావిల మౌతుంది. కండ్లనీళ్లు తిరుగుతాయి. సుధాకర్ కు పశ్చాత్తాపం కలుగుతుంది.

ఓ రోజు సుధాకర్ ఆనందాలు చిందే చిరునవ్వులతో సౌదామినిగదికి వచ్చాడు. ఏకాంతతను

భరించలేని నిస్పృహ, ప్రియుని రాక నెదురుచూచే నిరీక్షణ ఆమెలో ద్యోతక మౌతున్నాయి. "రాణీ! నేటి నా ప్రణవనృత్యం చక్రవర్తినే గాదు. భగవానునికూడా మెప్పించి వుండాలి. నేటి నీ సుధాకర్ నృత్యం నీవు కూడా చూస్తే...కానీ నీకో మంచి కానుక తెచ్చా.. నాట్యంలో ముగ్ధుడైన చక్రవర్తి కోరుకొమ్మంటే నీకో సవతిని...కోరుకొన్నా—చూడు ఈ ప్రతిమను ఎవరో శిల్పి...నా రాణిని తన స్వప్నాల్లోనైనా చూచి ఉండాలి...లేకపోతే ఈ పోలిక లెలా వస్తాయి?"

"సుధా! ఇది చక్రవర్తిఆస్థానంలోదే?" సౌదామిని ప్రశ్న.

"మొన్నటి శిల్పప్రదర్శనలో ప్రథమబహుమానం, ప్రత్యేకగౌరవం అందుకొన్న ప్రతిమ. నిజానికి అసాధ్య మనుకొన్న నా కోరికను సాధించుకొన్నందుకు నా నాట్యాన్ని నేనే అభినందించుకొన్నా—"

'స్వర్గానికి పోయినా సవతిపోరు తప్పలేదు' అన్నట్లు—సౌదామినికి అదే ప్రతిమ అదే బండరాయి—ఇక్కడకూడ సిద్ధమైంది. ఇందరి హృదయాల్లో ఇంత విశిష్టస్థానాన్ని సంపాదించుకొన్న ఆ శిల్పసుందరిని తాను చేతులారా ముక్కలు చేయటం ఎలా? గంగపాలు చేయట మెలా? అమ్మో! హృదయం బ్రద్దలు కాదూ? శివశ్రీని తాను విడచినా తన్ను శివశ్రీ వదలటం లేదు. ఆమె మరిచిపోవటానికి చేసే ప్రయత్నాలన్నీ వ్యర్థమైపోతున్నాయి. శివశ్రీకి తన హృదయంలో ఓ సుస్థిర స్థానము ఉంది. చిత్రాంకితమైన శివశ్రీమూర్తి ఎంత ప్రయత్నించినా అదృశ్యం కాదు సరికదా, రోజురోజూ రంగులు పూనుకొని మరింత ప్రస్ఫుట మౌతుంది. ఆమె కీచిత్రవ్యథ దుర్భరమైంది. ఏ మనుకొంటుంది? శరీరానికి హృదయానికి సంఘర్షణ అనుకొంటుందా? సాంప్రదాయానికి సంస్కృతికి యుద్ధ మనుకొంటుందా?—

లేదు, తన జీవితంలో ఇక శాంతి లేదు. వెలుగు లేదు. అనందం లేదు. అయినా శివశ్రీ తన కేం లోపం చేశాడని? అతని అద్భుతకళానైపుణి; దేశదేశాలకు ఆదర్శంగా నిలచే ఈ సుందరమూర్తులను ఏకాగ్రతతో సాధించటం—ఇవేనా అతని లోపాలు? అతని కెవ్వరున్నారు? అయినా—ఎందుకీ గతజల సేతుబంధనం? తన చిరునవ్వుల్లో ఆనందసౌధాలు నిర్మించుకొనే అమాయకజీవి—తననే సర్వస్వముగా ఆదరించే యీ సుధాకర్ను అన్యాయం చేయలేదు.

* * *

"సౌదామినీ! ... సౌదామినీ!!" వెర్రికేకలు తోటల్లో ప్రతిధ్వనిస్తున్నాయి. ఆనాడు శిల్పప్రదర్శనానికి సౌదామినిని తీసుకొనిపోవాలని శివశ్రీ ఆరాటం. తనకు తెలియని ఏ ప్రదేశాలకు వెళ్తుంది? వెతికాడుతోటలన్నీ. ఊరంతా గాలించాడు. నిస్పృహతో నిరాశతో ఇల్లు చేరుకొన్నాడు. తన సౌదామిని తన్ను విడిచిపోయిందేమో నని పసిపిల్లవాడిలా ఏడ్చాడు. తన జీవితమే శూన్యం చేసి పోయింది. మోడయిపోయిన తన నిరాశాపూరితజీవితంలో చల్లని వెన్నెల చిమ్మిన సౌందర్యమూర్తి సౌదామిని స్మారకచిహ్నంగా ఆ ప్రతిమను ప్రదర్శనకు తీసుకొనిపోకూడదనుకొన్నాడు. కాదు. తన బ్రతుకి కెందుకు? విషాదమధురస్మృతు లెందుకు? ఆ సౌందర్యంలోని ఛాయలనైనా ప్రపంచం చూడ గలుగుతుంది.

మరునాటి ఉదయానికి రాజధానినగరం చేరుకొన్నాడు శివశ్రీ; తన 'మూర్తి'తో. జీవితంలోని, బరువు, విషాదం అంతా అతనిముఖంలో కండ్లలో కనబడుతున్నాయి. ప్రదర్శన దిగ్విజయంగా సాగింది. చక్రవర్తి ఓ విధమైన గర్వంతో శిల్పాలన్నిటినీ చూచాడు. శివశ్రీ కళామూర్తిని చూచి ముగ్ధుడ కూడు. చకితుడై నిలబడ్డాడు — ప్రథమబహుమానం శివశ్రీది. అందుకొన్నాడు. ఎందు కిది తనకు? ఎవరికోసం? తన గౌరవానికి మురిసే దెవరు? నాటి సాయంత్రం చక్రవర్తి శివశ్రీని తన ఆస్థానంలో 'శిల్పరత్న' పదవి స్వీకరించమని సగౌరవంగా కోరాడు. "నా కళాతపస్సు ముగియలేదు" "నే నీ పదవికి అసమరుడను" ఇలా తప్పుకొంటాడు శివశ్రీ. చక్రవర్తిలోని అహం, కీవి ప్రజ్వలించాయి. "లేదు అంగీకరించి తీరాలి" అజ్ఞాపించాడు. "న న్నాజ్ఞాపించే అధికారం మీకు లే"దనే

జవాబు నెమ్మదిగా. సభాసదులంతా నిర్విణ్ణులయారు చివరికి—"నా సౌదామిని నాకు లభించేవరకూ నే నే విషయాన్నీ అంగీకరించలేను." అన్నాడు శివశ్రీ—'అయితే మేమూ ప్రయత్నిస్తాము. ఒక నెల గడువు. ఆ పైన మీరు ఈ 'శిల్పరత్న' పదవి స్వీకరించకపోతే రాజాజ్ఞాతిరస్కారనేరంపై......' సభ ముగిసింది. నాట్యరత్న సోదరకళాజీవనస్థితికి బరువెక్కనగుండెలతో పోయాడింటికి—"రాణీ!"ని పిలచి అంతా చెప్పాడు. స్వాతంత్ర్యరక్తిలో, కళాసేవలో తనకు ఆదర్శమూర్తి శివశ్రీ అన్నాడు తుదకు. అంతా తెలుసుకొంది సౌదామిని. ఇప్పుడు తాను కనపడితే వచ్చే విచిత్ర ఫలితాలను తన హృదయం భరించలేదు. ఎందరికో హృదయవేదన కలిగించే పని తాను చేయదు. శివశ్రీని మరువలేదు. సుధాకర్‌ను విడువలేదు. శివశ్రీ ఏమౌతాడు? అతడు పవిత్రహృదయంతో తన చేతులలో నుంచిన అతని జీవితమును చివరికి తా నిట్లా దిద్దిందా? సుధాకర్ ఏమి కావాలి? తటస్థంగా ఊరుకోవటం తప్ప—ఈ విషమపరిస్థితులలో తా నేమి చేయాలో తెలవలేదు. ఆ అనుభవంలేని — వ్యథితహృదయినికి గడిచిపోతున్నాయి, గంటలు ... దొర్లిపోయినాయి దినాలు—

గడువు సమాప్తమైంది. తోటల్లో పిచ్చిగా తిరిగే శివశ్రీని బంధించి తెచ్చారు రాజభటులు. వెర్రికేకల్తో సౌదామినిని పిల్చుకొంటూ ఆస్థానంలో ప్రవేశించాడు శివశ్రీ. అతనిలో ఈ నెల—ఈ ఒక్క చిన్న నెల ఎంత మార్పు తెచ్చింది! జవాబైనా చెప్పని శివశ్రీ "దురహంకారానికి" రాజుగారి అహంకారం పెచ్చుపెరిగింది. రాజాజ్ఞ నుల్లంఘించిన పాపానికి, 'శిల్పరత్న' పదవిని నిరసించిన శివశ్రీ దురహంకారానికి ప్రాయశ్చిత్తంగా మరణశిక్ష...కోటవెలుపలి కొండకొమ్మునుండి క్రింద నదిలోనికి పడద్రోసి చంపాలి శివశ్రీని. సభ నిశ్వాసాలతో వేడెక్కింది. హాహాకారాలతో విలపించింది. కన్నీటిలో మసక కమ్మింది. ఓ మూలనుండి పెద్ద వెర్రికేక వినపడింది. విషాదావిలమైన ఆ స్వరం శివశ్రీ ఆప్తులదే అయివుంటుం దనుకొన్నారు. సభ్యులు సానుభూతితో—ఇద్దరికి మాత్రము అందులో ఏదో కనపడింది. వినపడింది. 'సౌదామినీ' అని అరిచాడు శివశ్రీ. 'రాణీ!' అన్నాడు సుధాకర్. కాని ఆమె లేదక్కడ. శివశ్రీ పరుగుపెట్టే ప్రయత్నాలన్నీ బంధించిన రాజభటులు వ్యర్థంచేశారు. సుధాకర్ శివశ్రీని విడువలేడు. తన రాణీ ఇచటి కెందుకు వచ్చినదో? ఎన్నడు గదినైన వీడి బయటికి రాని ఈమె నేడు బహుశా శివశ్రీ విషాదజీవిత వృత్తంమీద జాలిగలిగి రాజాస్థానానికి వచ్చివుంటుంది. అయినా కళాదేవి వరప్రసాదమూర్తిగా కనపడే శివశ్రీ ఇలా మరణించాల్సిందేనా అని అతని బాధ.

అయినా ఇంటికి పరుగెత్తాడు. సుధాకర్... మృత్యుమందిరానికి తరలించారు శివశ్రీని—

... ... ... ...

అప్పుడే కోడి కూసింది. చీకట్లు తొలగుతున్నాయి. ఉషశ్రీలు విరుస్తున్నాయి. క్రింద నదిలోనుండి ఒక మధుర—నీరస—స్త్రీ—స్వరం 'శివశ్రీ! శివశ్రీ!' అని జపిస్తున్నట్లు వినిపించింది. సరిగా పైనున్న ఉన్నతశిఖరంమీది శివశ్రీకి. 'సౌదామినీ' అని పెద్దగా జవాబుగా అరచాడు. 'శివా!' అని మళ్లా...'సౌదామినీ' అని తిరిగి...రాజభటులు విసరకముందే తానే దూకాడు క్రిందికి శివశ్రీ—'సౌదామినీ సౌదామినీ' అంటూనే. ఇంకా నీరసించిపోయిన గొంతు ఆహ్వానిస్తునే వుంది 'శివా' అని. చేరుకొన్నాడు తన సౌదామినిని చివరికి...కాని ఆమెకౌగిలిలో చేరాడో లేదో—కన్నుమూశాడు. తన శివ తన్ను చేరుకొన్నాడు... ఈ రక్తపు ముద్దగానైనా...కౌగిలించుకొంది. గాఢంగా లేనిబలం తెచ్చుకొని...నదిలో కొట్టుకొని, మునిగి, తేలి, చేరుకొని రాత్రంతా ఆ నీళ్లలో, మితిలేని హృదయవేదనలో గడిపిన ఆమె సుకుమారశరీరం ఈ ఆయాసాన్ని సహించలేకపోయింది. విషాదసంఘర్షణల్లో విశీర్ణమైన ఆమెహృదయం ఈ విచిత్ర ఆనందాన్ని భరించలేకపోయింది. సౌదామినిప్రాణవాయువులు అనంతవిశ్వంలో లీనమయాయి—'సుధాకర్' చూచాడు విరాగిలా—దిగ్భ్రమతో—రెండు సుందరశరీరాలు గాఢాశ్లేషంలో నదీజలాల్లో జలజలా సాగిపోవటం—

'మరణము జీవయాత్రకు సమాప్తము కాదు, అంటారు భారతీయతాత్త్వికులు. అందులో సత్యాన్ని పరిశీలించేందుకు ఇక్కడ అర్హతకంటె అవశ్యకత తక్కువ. కాని ఒకటిమాత్రం సత్యం. శివశ్రీ ఉత్తమశిలావిన్యాసాలనూ, సౌదామిని ఉదాత్తసౌందర్యాన్నీ దర్శించేందుకు దేశం నోచుకోలేదు.